# వికృతి

సుందరం నిజంగా సుందరుడే.

మగాళ్ళ క్కూడా ముద్దొ చ్చేంత అందం అతనిది.

ఎత్తుగా ఎర్రగా తేనె లూరే కళ్ళతో రింగుల జుత్తుతో అచ్చంగా రాజకుమారుడిలా ఉంటాడు. విశేష మేమిటంటే అతనంత అందంగా ఉంటాడని అతనికే గుర్తుండదు.

అహంకారం లేని అమాయకమైన అందం ఇంకెంత ఆకర్షణగా ఉంటుంది! మా మిత్ర బృందానికి సుందర మంటే ప్రత్యేకమైన అభిమానం, ఇష్టం!

పెళ్ళయిన రెండేళ్ళకి సుందరానికి ఆడపిల్ల పుట్టింది. అందంలో సుందరం తల దన్నేలా ఉంది ఆ పిల్ల.

"ఈ పిల్ల వల్ల మరి పదహారేళ్ళకి వందల గుండెల్లో భూకంపాలు సంభవిస్తాయి..." అన్నాడు సుబ్రమణ్యం. వాడు కొంచెం కవి.

"సుందరం నువ్వు అదృష్ట వంతుడి వోయ్! ఈ పిల్లకి పెళ్ళి చెయ్యడం నీ కెప్పటికీ సమస్య కానే కాదు. వరకట్నం కాదు కదా... నీకే బోలెడు కన్యాశుల్కం వచ్చి పడినా ఆశ్చర్యం లేదు!" అని దీవించాడు చలపతి.

సుందరం తృప్తి పడ్డాడు. నిజానికి అతని దృష్టిలో ప్లస్ మైనస్ అనే లెక్కలు ఎప్పుడూ లేవు.

"ఈ కాలం ఆడపిల్ల పెళ్ళి పెద్ద సమస్య కాదు. ఎందుకంటే వాళ్ళు కూడా బాగా చదువుకుని సంపాదించ గలుగుతున్నారు. ఆర్జన వల్ల పెళ్ళి సమస్య చాలా వరకు తీరుతుంది. పిల్ల అందంగా ఉంటే అసలు సమస్య వరుణ్ణి వెదకడం కాదు... వచ్చిన వాళ్ళలో మనకు నచ్చిన వాణ్ణి ఏరుకోవడమే!..." అంటూ మిత్ర బృందానికి చక్కటి పార్టీ ఏర్పాటు చేశాడు.

ఈ రోజుల్లో రంగు పార్టీ అంటే మాటలా? సుందరం ఖర్చుకి వెనుకాడ

లేదు. రెండో రౌండ్‌లో సుబ్రమణ్యం కాస్త మూడ్ లోకి వెళ్ళి "పిల్లకి ఏదైనా మంచి పేరు పెట్టవా?" అన్నాడు.

"ప్రకృతి!" అన్నాడు సుందరం.

మేమంతా తెల్లబో తుండగా అతను నీటిలో చేప నీరు తాగుతున్నట్టు గుంభనంగా నవ్వుతూ "నా కూతురు నా లాగే అందంగా పుట్టినందుకు ప్రకృతికి థాంక్స్ చెబుతూ ఆ పేరే పెట్టాలనుకుం టున్నా.... ఆడపిల్ల చూడ చక్కగా లేకపోతే నాకు చాలా అసంతృప్తి! భయం. ఎందుకూ అంటే..." అంటూ కలలోంచి చూసి నట్టు చూశాడు.

"కొంపదీసి ఫ్లాష్ బ్యాక్ ఉంటే... ఫ్లాష్ చేసెయ్య కూడదూ?..." అన్నాడు చలపతి.

"ప్రకృతి లోంచి వికృతి వచ్చినట్టు... అందమైన జీవితంలో చిన్న ఫ్లాష్ బ్యాక్ ఇది..." అంటూ చెప్పడం ప్రారంభించాడు సుందరం...

ఉద్యోగ రీత్యా ఆ ఊరెళ్ళాను నేను. బ్రహ్మచారి జీవితం. టెంపరరీగా మకాం.

పగలంతా ఆఫీసు. కంపెనీ పని. హొటల్స్‌లో భోజనం. ఎప్పుడైనా సినిమా, షికారు.

ప్రశాంతంగా ఉండే ఒక ఏరియాలో ఒక చిన్న ఇంటి మేడ మీద అతి చిన్న గది దొరికింది. ఆఫీస్ మనిషి ఒకతను కుదిర్చి పెట్టాడు. అద్దె ఎక్కువే అయినా సదుపాయాలు తక్కువే అయినా పట్టించుకో లేదు. కేవలం టెంపరరీయే కదా అని ధీమా.

పని, అలసట, నిద్ర కాక మరో జీవితానందమే తెలీనంత బిజీగా రోజులు గడుస్తుండగా... అప్పుడప్పుడూ కొంత కొంతగా సమాచారం తెలిసేది... ఆ ఇంటి గురించీ ఇంటి వాళ్ళ గురించీ...

ఇంటి వాళ్ళంటే ఎందరో లేరు. తల్లీ కూతురూ, మతి స్థిమితం లేని చిన్న కొడుకూ... అంతే నట. ఇంటాయన చాలా చిన్న ఉద్యోగి. కొడుకు...పుట్టిన కొద్ది రోజులకే ఏదో పెద్ద జబ్బు చేసి పోయాడట.

అయితే సొంత ఇల్లు మాత్రం మిగిలింది. కూతురు డిగ్రీ దాకా చదివి ఏదో చిన్న ఉద్యోగం చేస్తోంది. ఆ తల్లికి ఈ రెండే ఆధరువులు. వినగానే అయ్యో పాపం అనిపించే అవస్థే. అద్దె ఎక్కు వనిపించే బాధ కూడా కొంచెం

తగ్గిన ట్లయింది.

ఇల్లు నాకు పాతబడినట్టే మనిషినీ వాళ్ళకు పాతబడ్డాను కాబోలు మెల్లమెల్లగా పరోక్షంగా పలకరింపులు పరామర్శలు మొదలయ్యాయి. దాంతో బాటు తరచు చిన్న చిన్న పరోపకారాలు కూడా!

మొదట్లో లేదు గానీ... మేడ మెట్లు నీటుగా చిమ్మి ఉండడం, శుక్ర వారం వరండా దాకా అంతా కడిగి ముగ్గులు వేసి మహా ముచ్చటగా ఉండడం, పౌర్ణమి నాడు కుర్రాడు ఫలహారాల పళ్ళెం పట్టుకొచ్చి ఇవ్వడం...

మరో నాడు నేను ఆఫీసుకి బయలు దేరుతుండగా ఇంటావిడ మెట్ల దగ్గర ఆపి "తాళం ఇచ్చిపో నాయనా... గది శుభ్రం చేసి పెడతాము... ఒక్కడివీ నువ్వేం చేసుకోగలవు?..." అనడం...

మంచి రోజులు కావని నిస్పృహ పడడం ఎందుకూ? ఇంటి ఓనర్లలో కూడా మహాత్ములు ఉండవ చ్చనిపించింది! ఇంటావిడకి నలభై ఐదు పైనే ఉండొచ్చు. నుదుట బొట్టు లేకున్నా ముఖంలో మంచి కళ ఉంది. దురదృష్టానికి ఎన్ని రూపాలో!

ఉద్యోగం కొత్త. భవిష్యత్తు ముందుంది. పోటీ పడకుంటే ముప్పే. ఆఫీస్ పనికి టైం చాలేదే కాదు. నా డ్యూటీలో తిరుగుడు ఎక్కువ. టి.ఎ., డి.ఎ. లు ఏ మూలకు కాని ఒళ్ళు హూనమైపోయేది.

భూమి మీద నాకున్న స్వర్గమల్లా నా రూంకి వచ్చి హాయిగా లుంగీ కట్టుకుని పడుకోవడం! అంతే! నా స్వర్గం కేవలం సుఖ నిద్ర! రంభ, ఊర్వశి, తిలోత్తమాదులు అవసరం లేదు.

అయితే వయస్సు కోరే అనుభవాలా? అప్పుడెప్పుడో... తెలిసీ తెలియని దశలో ఒకటి రెండు సార్లు గుట్టు చప్పుడు కాకుండా రుచులు తెలిశాయి. ఆ తరువా తెప్పుడూ అర్రులు చాచలేదు. తొందర పడలేదు. ఏ ముచ్చటకు ఆ టైము రానే వస్తుంది.

సంపాదన లేకుండా సౌఖ్యానికి ఎగబడితే నేల విడిచి సాము చేసినట్టే!

నా గది అనే మహా స్వర్గంలో నేను అలసట మరిచిపోయే దశలో... ఒకానొక మధ్యాహ్నం... హఠాత్తుగా... మెట్లెక్కి పైకి రాబోయి వెనుదిరిగి పోయిన మానవాకారాన్ని చూసి దిమ్మెర పోయాను.

నల్లగా వంకర టింకరగా ఉందా అమ్మాయి. తేరి పార జూసిన క్షణంలోనే పరమ వికారంగా కదిలాయి ఆ కళ్ళు. పొట్టి చింపిరి జుత్తు. కుండ బోర్లించిన

దిష్టి బొమ్మ గుర్తొచ్చింది. మరీ అంత వికారమా?

సాయంత్రం ఎటో వెళ్ళి వస్తుండగా ఇంటావిడ తలుపు వార నుంచి అన్న మాటలు కొరడా కొసల్లా మనసు పొరల్ని చీల్చాయి.

"ఎవరి కర్థమౌతుంది బాబూ నా గోడు! అదీ నా కూతురు! ఎవడు చేసుకుంటాడు దాన్ని? ఆస్తంతా కట్ట బెడతా మంటే... ఎవరన్నా.. చేసుకుంటానన్నా... దానికి పెళ్ళే వద్దట! ఎక్కడ చావను నేను?"

నాకెందుకు చెప్పడం? నేనేం పెళ్ళిళ్ళ పేరయ్యనా?

ఆ రాత్రంతా నిద్ర లేదు.

ఎవరి జీవితం వారిది. నేను కేవలం అద్దెకున్న వాణ్ణి. ఆర్చే వాణ్ణీ తీర్చే వాణ్ణీ కాను. నాకెందుకు వాళ్ళ తంటా?... అనుకున్నా వదల్లేదు...

నా బిజీ రొటీను మధ్య... ఎలాగో గానీ వాళ్ళ గొడవ కాస్త చెవిని పడుతూనే ఉండేది.

కింద ఆవరణ ఖాళీ. బావి చుట్టూ మంచి తోట. పెంకుటి వసారా అరుగులు.

తల్లీ కూతురూ వెర్రి కొడుకూ ఏవేవో పనుల్లో కనిపించే వాళ్ళు. తరచు ఎవరో వస్తూ పోతూ ఉండే వాళ్ళు. బంధువులట. డబ్బు. ఆస్తి. ముందు జీవితం. కొత్త సంబంధం. అబ్బాయి ఫలానా చోట, ఫలానా ఉద్యోగం...

ఆ అమ్మాయి మళ్ళీ రెండు మూడు సార్లు ఎదురు పడింది. నేను బెదిరి పోయాను.

మొదటి సారి చూసి నప్పటి షాక్ నుంచి కోలుకున్నాక... రకరకాల ఆలోచనలు వచ్చేవి.

అమ్మాయి అమ్మాయే. నలుపు. వంకర టింకర. నడిచేప్పుడు కాలు ఎగర వేస్తూ నడుస్తుంది. అలాగని కుంటి కాదు. నడకే అంత.

ఒక సాయంత్రం నేను ఆలస్యంగా గది కొచ్చే సరికి గుమ్మం పక్కన కిటికీ దిగువ గచ్చు మీద పువ్వులు అందంగా పేర్చి వున్నాయి. 'దేవుడు' అనే అక్షరాల్ని పారిజాతం పువ్వులతో పేర్చారు ఎవరు?

గాలిలా చిన్నగా మొదలయింది. నేను నిద్ర పోతుండగా చిన్నగా కింది నుంచి కూనిరాగం!

అమ్మాయి తమ్ముడు వచ్చి నా గది నుంచి పుస్తకాలు పట్టుకెళ్ళడం

మొదలెట్టాడు.

ఒక రోజు ఉదయం నేను హడావుడిగా ఆఫీసుకి బయలు దేరుతుండగా తల్లీ కూతుళ్ళిద్దరూ వాకిట్లో ఎదురు పడ్డారు. తల్లి అక్షింతలు నా చేతి కిచ్చింది. కూతురు నెమ్మదిగా భయంగా నా ముందు వంగింది. పాదాలకు నమస్కారం చేస్తూ.

"దేవి పుట్టిన రోజు బాబూ! నువ్వంటే వల్ల మాలిన అభిమానం... ఏమనుకోకు... దీవించు...!!"

నా దీవెనకేం? నిజంగా మనసు జల్లుమంది.

అంత వికారమైన పిల్ల మనసులో నాజూకు, సౌకుమార్యం, కళాతృష్ణ, సంగీతం అన్నీ ఉన్నాయి.

ఏం లాభం? సృష్టి సౌందర్యానికే దిష్టి చుక్క పెట్టినట్టు ఉందా రూపం... ఎవరు సహిస్తారు?

ఎలాగైనా పాపం ఈ అమ్మాయికి మంచి జరగాలి... అనుకుంటూ తోచిన రీతిలో దీవించేశాను.

ఒక రోజు రాత్రి... నా గాఢ నిద్ర చెదిరి పోయింది. అరుపులు. గోల. కేకలు. ఏడుపు.

చుట్టుపక్కల వాళ్ళు పోగయ్యారు.

దొంగలనుకుంటే కాదు.

ఇంటావిడ కూతురు... దేవి... బావిలో దూకింది. ఆత్మహత్యా యత్నం. బావిలోంచి తీశారు. నీళ్ళు కక్కించారు. మళ్ళీ ఏడుపులు, పెడబొబ్బలు.

మాటల మధ్య తెలిసింది. పెళ్ళి కుదిర్చారు. వద్దంది. తల్లి వినలేదు. బలవంతం చేసింది. ఖాయం చేసింది. ఇదీ ఫలితం.

తెల్లారే దాకా కింది నుంచి ఏడుపులు వినిపిస్తూనే ఉన్నాయి. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి ఎవడో ఒకడు ఒప్పుకోవడమే విశేషం. ఆ అమ్మాయి కాదనడం ఎందుకూ?

తరువాత నెమ్మదిగా తెలిసింది.

దేవికి వల్లమాలిన అభిమానం. తనని ఎవరూ చేసుకోరు. ఎవరూ కోరుకోరు. ఎదురైతే చీదరించు కుంటారు. తల తిప్పు కుంటారు. ముఖాన్నే తిడతారు. పెళ్ళి చేసుకుంటే కేవలం ఆస్తి కోసమే చేసుకుంటారు. పెళ్ళయ్యాక

ఇంకెంతో ఘోరంగా చూస్తారు.

అందుకే వద్దంటుంది. పెళ్ళే వద్దంటుంది. మగవాడే వద్దంటుంది. బలవంతం చేస్తే... భర్త కన్నా బావి మేలు అంటుంది, అంది.

తల్లి పూర్తిగా భయపడి పోయింది.

కలల్లో కాటుక చీకటికి ఆడదాని రూపం వస్తే... దేవి అవుతుంది. పొంకాలు లేని వయసు. అసహ్యంగా వంగినట్టుండే వీపు. కాంతి లేని కళ్ళు.

యౌవనం పన్నీటి వానలా కురిసినా ఏ పచ్చదనం వికసించని ఎడారి లాంటి తనువు. పైట ఉన్నా ఏమాత్రం ఉలికి పాటు లేదు. కర్ర లాంటి నడుము. నాట్యమే తెలియదు...

మనసెంత మంచి ముత్యమో వాళ్ళ తల్లి చూసుకోనీ గానీ పీడకల లాంటి ఆ అమ్మాయిని గురించి ఎవరు ఆలోచిస్తారు? నేనూ నా పని... నా గొడవలతో గుక్క తిరక్కుండా రోజుల్ని నెట్టేస్తుండగా తల్లీ కూతుళ్ళ ధ్యాస తెరమరుగే అయింది.

నెలో రెణ్ణెల్లో అలా గడుస్తూ ఉండగా నాకో అనుమానం వచ్చింది. అసలు వీళ్ళు ఉన్నారా ఎటైనా వెళ్ళి పోయారా? అని!

అమ్మాయి బావిలో దూకిన సంఘటన తరువాత... అంతా గప్ చుప్ అయిపోయింది. జీవితంలో మలుపులు అనుభవాలు చాలా సార్లు గప్ చుప్ గానే వస్తాయని తెలిసినప్పుడు మాత్రం నేను అదిరి పడ్డాను...

అది చిన్న మాటే.

అదిరి పడ్డానేమిటి?

నేనే మయ్యానో నాకే తెలియదు. ఇంటావిడ, అంత పెద్దావిడ కళ్ళ నీళ్ళు పెట్టుకుని నా కాళ్ళ మీద పడేసరికి హడలిపోక ఏమవుతాను?

అవేం మాటలు? అదేం కోరిక? ఇటువంటివి ప్రపంచంలో జరుగుతాయా?

ఒక తల్లి కూతురి కోసం ఏమైనా చేస్తుందేమో గానీ... ఈ పని చేస్తుందా? నేను మేజర్నే. సర్వ స్వతంత్రుణ్ణే అయినా... ధర్మ శాస్త్రాలలో ఇటువం టప్పుడు ఏం చెయ్యాలో ఎక్కడైనా చెప్పారా?

మనసు పడిన ఆడపిల్లను మన్నించడం మగ లక్షణమే గాని మగవా

డెవడైనా తాకడానికే భయపడి పోయే ఆ వికారాకారాన్ని... నాకంటూ ఇష్టమైనా లేకుండా... కేవలం ఆమె మనసు పడిందని... పెళ్ళి ప్రస్తావన ఎలాగూ లేదనుకో... అయినా... అదేం కోరిక?...

"కోప్పడితే మమ్మల్ని చంపెయ్యి నాయనా... పుట్టి బుద్ధెరిగి అది నన్నేమీ అడగలేదు. మంచి బట్టలిచ్చినా వద్దంటుంది. నగలు పెట్టుకోదు. వద్దంటుంది... తెలుసుగా... పెళ్ళి కూడా వద్దనేసింది. మొండిగానే ఉంటా నంటుంది... కాదంటే చస్తుంది..."

"అయితే... ఈ మధ్యనే నువ్వు వచ్చిన తర్వాతనే బాబూ... నిన్ను పెళ్ళి చేసుకోవాలని కాదు! బుట్టలో వేసుకోవడం కాదు... అంత దురాశ లేదు నాయనా! కానీ దాని జన్మకి ఒక్క సారి నీతో... ఒక్క సాయంత్రం... ఒక్క రాత్రి... తప్పో ఒప్పో తల్లిగా కూతురి కోసం కొంగు పట్టి అడుగుతున్నాను తండ్రీ..."

అయినా నేను ఎందుకు ఒప్పుకున్నానో...

లోకానికి తెలీదు. ఇప్పటికీ తెలీదు. తెలిస్తే నవ్వుకుంటారు. చీదరించు కుంటారు. పెళ్ళి, శృంగారం, సెక్స్, రసికత్వం, ఆనందం... అన్నిటికీ అందమే కావాలి. చర్మం మాంసం మెరుపులు చిమ్మితేనే అందం.

పచ్చటి తోటను మెచ్చినంతగా ముళ్ళ పొదల్ని మెచ్చరు. అవీ ప్రకృతిలో ఉన్నా పట్టించుకోరు.

ఆ రాత్రి ఒక చీకటి ముళ్ళ పొద కమ్మింది. ఆర్తి నిండిన కళ్ళు శ్రావణ మేఘాలై వర్షించాయి. ఈ చేతుల స్పర్శతో ఎడారికి గిలిగింతలై పచ్చటి పచ్చిక ఎదిగి వచ్చింది. గబ్బిలాల నిలయం లాంటి శిరోజాలకి కార్తీక మేఘాల నయగారాలు తెలిశాయి. దేవి నవ్వింది. ఏడ్చింది.

ఆమె పైటకు కూడా గిలిగింతలు తెలిశాయి.

ఆమె నడుముకు కూడా నాట్యాలు తెలిశాయి.

ఆమె పెదవులు సృష్టిలో మొదటి తేనె బొట్టును రుచి చూసినట్టు పులకించి పోయాయి.

తెల్లవారి వెలుగొచ్చే లోగా దేవి నన్ను నిద్రయినా లేపకుండా వెళ్ళిపోయింది. చీకట్లో ఏ ఆడదైనా ఒక్కటే నన్నారు కొందరు అనుభవజ్ఞులు. బహుశా వాళ్ళకు కావలసింది చీకటే కాని ఆడది కాదు.

ఆ రాత్రి దేవి నన్నెంతగా అలరించిందో చెప్పలేను. మళ్ళీ అటువంటి సుఖం ఎరుగను.

ఎందుకో ఖచ్చితంగా చెప్పలేను గానీ మరుసటి రోజే నేనా గది ఖాళీ చేసేశాను...

"బహుశా నువ్వే ఆమె కోసం ఆరాట పడతావని భయపడి పోయి వుంటావు. అంత వికారమైన అమ్మాయితో సంబంధం ఉన్నట్టు నలుగురికీ తెలిస్తే పరువు పోదూ?..." అన్నాడు చలపతి విమర్శిస్తూ.

"ఇటు వంటి వ్యవహారాలలో సున్నిత మనస్కులకి బెదురు పుట్టడం సహజం. అక్కడే కంటిన్యూ అయితే ఆ అనుబంధం బలపడి పోతుందని కూడా నువ్వు జంకి ఉండవచ్చు."

"తర్వాత ఏమైంది? నా గెస్ చెప్పనా? నీ లాంటి అందగాడితో మహత్తరమైన అనుభవం పొందింది కాబట్టి జీవితంలో గొప్ప కోరిక తీరింది కాబట్టి... ఆ అమ్మాయి ఇక బతకడం అనవసరం అని... చచ్చిపోయింది కదూ?" అన్నాడు సుబ్రమణ్యం.

"ఆడ మనసు కన్నా అగాథం మరొకటి లేదు. దేవిని మళ్ళీ నేనెప్పుడూ చూడలేదు. చూడాలనుకో లేదు. కానీ ఆ గది ఖాళీ చేసొచ్చాక కొన్ని రోజులకే నాకో గొప్ప వార్త తెలిసింది..." అన్నాడు సుందరం నాటకీయంగా కొంచెం సేపు ఆగి..."దేవి హాయిగా ఎవర్నో పెళ్ళి చేసేసుకుంది..." అన్నాడు.

"మరి అంత అభిమానం వైరాగ్యం ఏమైనట్టూ?"

"దీని గురించి నేనిప్పటికీ ఆలోచిస్తూనే ఉంటాను. రెండే రెండు సమాధానాలు తోస్తాయి..." అన్నాడు సుందరం. "నాతో అనుభవాన్ని దేవి మనసులో దాచుకుని దాన్ని గుర్తు చేసుకోవడానికే మిగతా జీవితాన్ని సాగిస్తూ ఉండాలి.. లేదా.. ఆ రాత్రే తన అభిమానానికీ వైరాగ్యానికీ అర్థమే లేదని అయినా తెలిపోయి వుండాలి... వీటిలో ఏది రైటో నాకు తెలీదు..."

మేమెవరం మాట్లాడ లేదు.

సుందరం గొణిగాడు: "ఇదంతా ప్రకృతి అనుకుంటాను..."

23.01.1998 సంచిక